క్లుప్తంగా

కూరగాయల ధరలు

దిల్‌సుఖ్‌నగర్: సరూర్‌నగర్/వనస్థలిపురం రైతుబజార్లలో కూరగాయల ధరలు (కిలో...రూపాయల్లో...) టమోటా 15, వంకాయ 23, బెండ 32, పచ్చిమిర్చి 35, కాకర 45, బీర 35, క్యాలిఫ్లవర్ 23, క్యాబేజీ 15, కారెట్ 37, దొండ 23, ఆలు 20, ఉల్లి 12, గోకర 45, దోస 13, సొర 11, పొట్ల 15, అరటి 10, చిక్కుడు 55, అర్వి 35, మునగ 45, చిలగడదుంప 40, బీట్‌రూట్ 21, కీర 18, ఫ్రెంచ్ బీన్స్ 90, కాప్సికమ్ 55. మంగళవారం 9 గంటల వరకు ఈ ధరలు అమలులో ఉంటాయి.

పేద మహిళ కంటి ఆపరేషన్‌కు చేయూత



కంటి ఆపరేషన్ చేయించుకున్న మహిళను పరామర్శిస్తున్న చిలుక ఉపేందర్‌రెడ్డి

దిల్‌సుఖ్‌నగర్: పేద ప్రజలకు నిరంతరం చేయూతనందిస్తానని రాష్ట్ర యువజన కాంగ్రెస్ నాయకులు చిలుక ఉపేందర్ రెడ్డి అన్నారు. మహేశ్వరం నియోజకవర్గం ఆర్‌కేపురం డివిజన్ పరిధిలోని ఎన్టీఆర్‌నగర్ బస్తీ నివాసి అయిన జిజీ బాయ్ అనే 77 సంవత్సరాల మహిళకంటి సమస్యతో ఇబ్బంది పడుతోంది. స్థానిక నాయకుల ద్వారా తెలుసుకున్న ఉపేందర్‌రెడ్డి మహిళకు నేత్రలాయ ఆసుపత్రిలో తన సొంత డబ్బులతో కంటి ఆపరేషన్ చేయించారు. ఈసందర్భంగా సోమవారం హాస్పిటల్‌కు వెళ్లిన ఉపేందర్‌రెడ్డి బిజీ బాయ్‌ను పరామర్శించారు. ఈ కార్యక్రమంలో కళ్యాణ్ యాదవ్, రాజు నాయక్, సలీం, ప్రేమ్ నాయక్, పింటూ, భాస్కర్ నాయక్, రవి నాయక్ తదితరులు పాల్గొన్నారు.

పనులు పరిశీలించిన కార్పొరేటర్



బాక్స్‌లైన్ పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ చింతల అరుణ

నాగోలు: రాబోయే వర్షకాలాన్ని దృష్టిలో ఉంచుకొని బాక్స్ లైన్ (డ్రైనేజీ) పనులు, సీసీ రోడ్లు పనులు తొందరగా పూర్తి చేయాలని నాగోలు డివిజన్ కార్పొరేటర్ చింతల అరుణ-సురేంద్రనాథ్ యాదవ్ అన్నారు. నాగోల్ డివిజన్ బండ్లగూడలోని కేతన్ ఎంక్లేవ్ కాలనీలో బాక్స్ లైన్ (డ్రైనేజీ) - పనులను జీహెచ్‌ఎంసీ అధికారులతో కలసి సోమవారం పరిశీలించారు. జీహెచ్‌ఎంసీ ఈఈ రమేష్ బాబు, ఏఈ చంద్రశేఖర్ రెడ్డి పాల్గొన్నారు.

రమేష్‌యాదవ్ మృతి బీజేపీకి తీరని లోటు

కవాడిగూడ: సలంద్రి రమేష్‌యాదవ్ ఆకస్మిక మృతి పార్టీకి తీరని లోటని హరియాణ గవర్నర్ బండారు దత్తాత్రేయ అన్నారు. సోమవారం దోమలగూడ గగన్‌మహల్‌లో రమేష్‌యాదవ్ కుటుంబసభ్యులను దత్తాత్రేయ పరామర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రజల్లోకి పార్టీని తీసుకెళ్లి బలోపేతానికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయమన్నారు. వారి కుటుంబానికి పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. దోమలగూడ మాజీ కార్పొరేటర్ రవీందర్, బీజేపీ రాష్ట్ర నాయకులు పరిమళ్‌కుమార్, వెంకటేష్, ఓబీసీ మోర్చా నగర అధ్యక్షుడు సలంద్రి శ్రీనివాస్‌యాదవ్, డివిజన్ బీజేపీ అధ్యక్షుడు మహేందర్‌బాబు, సలంద్రి దిలీప్‌యాదవ్ తదితరులున్నారు.

అనిల్‌కుమార్ యాదవ్‌కు సన్మానం

కాచిగూడ: కాంగ్రెస్ పార్టీ సికింద్రాబాద్ జిల్లా అధ్యక్షులుగా ఎం.అనిల్‌కుమార్‌యాదవ్ నియమితులైన సందర్భంగా కాంగ్రెస్ పార్టీ సోషల్ మీడియా కో- ఆర్డినేటర్ ఎం.రాజ్‌కిరణ్ సోమవారం న్యూ ఎమ్మెల్యే క్వార్టర్స్‌లోని ఆయన కార్యాలయంలో కలిసి ఘనంగా సత్కరించి అభినందించారు. సికింద్రాబాద్ జిల్లాలో పార్టీ మరింత అభివృద్ధి చెందుతుందని పార్టీ కార్యకర్తలకు అండగా ఉండే నేత అధ్యక్షుడిగా రావడం తమకు ఆనందంగా ఉందన్నారు.

చేనేత కార్మికుడికి రూ. లక్ష అందజేయాలి

కాచిగూడ: ఇటీవల జరిగిన రాష్ట్ర మంత్రివర్గ సమావేశంలో రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన కులవృత్తులకు చేయూత, కుటుంబానికి రూ. లక్ష పథకాన్ని అత్యంత ఇబ్బంది పరిస్థితులలో ఉన్న పద్మశాలీయుల చేనేత అనుబంధ పనుల శ్రామికులకు వర్తింపజేసి అమలు చేయాలని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఉపాధ్యక్షుడు గుజ్జ సత్యం డిమాండ్‌చేశారు. దుర్భరస్థితిలో ఉన్న కులవృత్తుల వారికి ఇది ఎంతో మంచి పథకం అన్నారు. రాష్ట్రంలో సుమారు 60 వేల మగ్గాల ద్వారా సుమారు రూ.3 లక్షల మంది పద్మశాలీ శ్రామికులు జీవనాధారం పొందుతున్నారన్నారు.

వరద నీటి సమస్య తలెత్తకుండా చర్యలు

ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి



అభివృద్ధి పనులకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి, కొత్తపేట కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్

నాగోలు: రాబోయే వర్షాకాలాన్ని దృష్టిలో పెట్టుకొని డ్రైనేజీ నాలాలలో మట్టిని తొలగించే కార్యక్రమం వేగవంతం చేశామని, వరదనీరు రాకుండా పటిష్ట చర్యలు తీసుకున్నట్లు ఎల్‌బీనగర్ ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్‌రెడ్డి అన్నారు. సోమవారం కొత్తపేట డివిజన్‌లో చేపట్టే వివిధ అభివృద్ధిపనులకు కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ నాయికోటి పవన్‌కుమార్‌తో కలిసి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి మాట్లాడుతూ ఎల్‌బీనగర్ నియోజకవర్గంలో ఇప్పటివరకు 80 శాతం పనులు పూర్తి అయినట్లు తెలిపారు. త్వరలోనే మిగతా పనులు పూర్తి చేస్తామని తెలిపారు. స్నేహపురి కాలనీలో కాలనీ సంక్షేమ భవనం శిథిలవస్థకు చేరిదని దారి కొసం త్వరలోనే నిధులు కేటాయిస్తామని తెలిపారు. కొత్తపేట డివిజన్ కార్పొరేటర్ పవన్‌కుమార్ మాట్లాడుతూ కొత్తపేట డివిజన్‌లో డ్రైనేజీ సమస్య తీవ్రంగా ఉందని అనేక ప్రాంతాలలో మ్యానువల్స్ కుంగిపోయినట్లు వెంటనే నిధులు కేటాయించాలని ఎమ్మెల్యేను కోరారు. కార్యక్రమంలో కొత్తపేట మాజీ కార్పొరేటర్లు సాగర్ రెడ్డి, వజీర్ ప్రకాశ్ గౌడ్, డివిజన్ బీఆర్‌ఎస్ పార్టీ అధ్యక్షులు లింగాల రాహుల్ గౌడ్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న అధికారులు

మీర్‌పేట: పోషణ అభియాన్ కార్యక్రమంలో భాగంగా సోమవారం మీర్‌పేట కార్పొరేషన్ లెనిన్‌నగర్ ప్రశాంత్‌నగర్ ఫేజ్-1లోని అంగన్‌వాడీ కేంద్రంలో మిషన్ లైఫ్, పర్యావరణ పరిరక్షణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా నీటి నిల్వ, వర్షపునీటి నిల్వ, సురక్షితమైన నీరు, ఇంకుడుగుంతల ప్రాధాన్యతపై గర్భిణులకు వివరించారు. అదే విధంగా ప్లాస్టిక్ వాడకం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ జ్ఞానకుమారి, అంగన్‌వాడీ టీచర్ సంగీత, హెల్పర్ శ్వేత, ఎల్‌ఎంఎస్‌సీ కమిటీ అధ్యక్షురాలు పద్మ, యూత్ ప్రెసిడెంట్ పవన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్నేషనల్ సమ్మిట్‌కు నగరవాసి



సమ్మిట్ మాట్లాడుతున్న ఎండీ సోహేల్

మలక్‌పేట: దుబయ్‌లో జరిగిన ప్రతిష్ఠాత్మక ఐక్య రాజ్యసమితి బెస్ట్ డిప్లొమాట్ ఇంటర్నేషనల్ సమ్మిట్‌లో భారత దేశంతరఫున మూసారంబాగ్‌కు చెందిన మహమ్మద్ సోహేల్ ప్రతినిధిగా పాల్గొన్నారు. ఈనెల 20న జరిగిన సమ్మిట్‌లో 100 దేశాలకు చెందిన దౌత్యవేత్తలతో నిర్మాణాత్మకమైన చర్చల్లో పాల్గొనడం గర్వకారణంగా ఉందని సోమవారం ఆయన తెలిపారు. భారత దేశ విదేశాంగ విధాన ప్రాధాన్యతలు, ప్రపంచ సమస్యలు, ఇతర దేశాల దృక్కోణాలతో పరిచయం చేసుకోవడం పట్ల సంతోషం వ్యక్తం చేశారు.

మాదన్నపేటలో అక్రమ పార్కింగ్ వసూళ్లు రద్దు

చంచల్‌గూడ: అక్రమ పార్కింగ్ వసూళ్లకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని జీహెచ్‌ఎంసీ సర్కిల్-7 డిప్యూటీ కమిషనర్ నరసింహ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాతబస్తీలోని మాదన్నపేట కూరగాయల మార్కెట్‌లో నిర్వహిస్తున్న అక్రమ పార్కింగ్ వసూళ్లకు సంబంధించిన ట్రేడ్ లైసెన్స్‌లను రద్దు చేసినట్లు పేర్కొన్నారు. మార్కెట్‌లో అక్రమ పార్కింగ్ వసూళ్లపై జీహెచ్‌ఎంసీకి అందిన ఫిర్యాదుల నేపథ్యంలో సమగ్ర విచారణ చేపట్టి ఎట్టకేలకు పార్కింగ్ వసూళ్లపై నిషేధం విధించారు. ట్రేడ్ లైసెన్స్ కోసం స్వయంగా ఆన్‌లైన్‌లో చేసే వెసులుబాటు ఉండటంతో అక్రమంగా ట్రేడ్ లైసెన్స్ పొందినట్లు అధికారులు గుర్తించారు. సరైన పత్రాలు లేకుండా ట్రేడ్ పొంది అక్రమ పార్కింగ్ వసూళ్లకు పాల్పడుతున్నట్లు ఎన్‌ఫోర్స్‌మెంట్‌తో పాటు జోనల్ కమీషనర్‌కు బాధితులు ఫిర్యాదు చేశారు. రెండు నెలల పాటు విచారణ చేపట్టిన అధికారులు ఎట్టకేలకు ట్రేడ్ లైసెన్స్ రద్దు చేశారు. ఇకపై అక్రమ పార్కింగ్ వసూళ్లకు పాల్పడితే జీహెచ్‌ఎంసీ, పోలీసులకు ఫిర్యాదు చేయాలని డిప్యూటీ కమీషనర్ నరసింహ తెలిపారు. పార్కింగ్ వసూళ్ల రద్దు విషయమై మాదన్నపేట పోలీసులకు సమాచారమిస్తామని ఆయన తెలిపారు.

వక్ఫ్ బోర్డు భూములను కాపాడండి

హయత్‌నగర్: హయత్‌నగర్ డివిజన్‌లోని అన్మగల్ హయత్‌నగర్‌లోని వక్ఫ్ బోర్డు భూములను కొందరు ఆక్రమించేందుకు ప్రయత్నిస్తున్నారని ఆ భూములను కాపాడాలని పీసీసీ కార్యదర్శి బాస్కర్ యాదవ్ సోమవారం రంగారెడ్డి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో ఫిర్యాధు చేశారు. సర్వే నెంబర్ 88,89,147 సుమారు 3 ఎకరాల 36 గుంటల భూమి ఉందని కొంత కాలంగా ఈ భూమిని కాజేయాలని కొందరు భూ వ్యాపారులు ప్రయత్నిస్తున్నారని ఫిర్యాధులో పేర్కొన్నారు.

కాలనీ సమస్యలు నా దృష్టికి తెండి

యూత్ కాంగ్రెస్ నేత రాఘవేందర్‌రెడ్డి



కాలనీవాసులకు నగదు అందజేస్తున్న రాఘవేందర్‌రెడ్డి

బడంగ్‌పేట్: కార్పొరేషన్ పరిధిలోని 26వ డివిజన్‌లోని తిరుమలనగర్‌లో యూత్ కాంగ్రెస్ మహేశ్వరం నియోజకర్గ అధ్యక్షుడు బోయపల్లి రాఘవేందర్‌రెడ్డి తన సొంత నిధులతో వీధిలైట్లు ఏర్పాటు చేసేందుకు కాలనీవాసులకు నగదు అందజేశారు. కార్పొరేషన్ పరిధిలోని అల్మాస్‌గూడ తిరుమలనగర్‌లోని రోడ్ నంబర్ 3, 4 లో వీధిలైట్ల లేక ఇబ్బందులు పడుతున్నారని కాలనీవాసులు రాఘవేందర్ రెడ్డి దృష్టికి తీసుకుపోగా స్పందించిన ఆయన వీధి లైట్లకోసం సొంతనిధులను కాలనీవాసులకు అందజేశారు. కాలనీల్లో ఎలాంటి సమస్యలున్నా తనను సంప్రదించాలని కోరారు. కాలనీ సంక్షేమ సంఘం ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.

వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో దళిత బహుజన పార్టీ పోటీ

కాచిగూడ: వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో రాష్ట్ర వ్యాప్తంగా అన్ని నియోజకవర్గాల నుంచి పార్టీ అభ్యర్థులను బరిలోకి దింపుతున్నట్లు దళిత బహుజన పార్టీ జాతీయ అధ్యక్షుడు వడ్లమూరి కృష్ణ స్వరూప్ అన్నారు. సోమవారం నారాయణగూడలో నియోజకవర్గ ఇన్‌చార్జ్‌లకు నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. డాక్టర్ బాబా సాహెబ్ అంబేడ్కర్ ఆశయ సాధన కోసం ఎన్నికల్లో పోటీ చేయడానికి దళిత బహుజనులు ముందుకు రావాలని పిలుపునిచ్చారు. అంబేడ్కర్ సందేశ్ యాత్రలో భాగంగా రాజ్యాధికారం చైతన్య ర్యాలీని జూన్ 24న పెద్దపల్లిలో భారీ ఎత్తున నిర్వహిస్తున్నట్లు రాంచందర్ ప్రకటించారు. పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు సీహెచ్ కరుణాకర్, పార్టీ గ్రేటర్ హైదరాబాద్ వర్కింగ్ ప్రెసిడెంట్ సుబ్బారావు, మంచిర్యాల జిల్లా అధ్యక్షుడు దాసరి రవికుమార్ తదితరులున్నారు.

బూత్ స్థాయిలో సమస్యల పరిష్కారానికి కృషి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంసీ వేణుగోపాల్

అంబర్‌పేట: నియోజకవర్గంలో పోలింగ్‌బూత్ స్థాయిలో సమస్యలు, అభ్యంతరాలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలని జీహెచ్‌ఎంసీ సర్కిల్-16 డీఎంసీ వేణుగోపాల్ ఆయా రాజకీయ పార్టీల ప్రతినిధులను కోరారు. సోమవారం అంబర్‌పేట్ మున్సిపల్ ఇండోర్ స్టేడియంలో జీహెచ్‌ఎంసీ ఆధ్వర్యంలో అన్ని రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఓటర్ల జాబితా, పోలింగ్ కేంద్రాల సమస్యలపై సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా వేణుగోపాల్ మాట్లాడుతూ.. నియోజకవర్గంలోని పోలింగ్‌బూత్‌ల వివరాలను వెల్లడించారు. ఓటర్ జాబితాలో ఎలాంటి ఇబ్బందులున్నా తన దృష్టికి తీసుకొస్తే పరిష్కారానికి తగిన చర్యలు తీసుకుంటామన్నారు. బీజేపీ పార్టీ నుంచి అజయ్‌కుమార్, సీపీఎం నుంచి మహేందర్, బీఆర్‌ఎస్ నుంచి అక్తర్ పాషా, అధికారులు ప్రవీణ్ చంద్ర, హరిశంకర్, రజిత తదితరులున్నారు.

సెంట్రల్ పీస్ కమిటీ వెస్ట్‌జోన్ అధ్యక్షురాలిగా తేజూరావు

కాచిగూడ: సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ వెస్ట్ జోన్ అధ్యక్షురాలిగా తేజూరావును నియమించినట్లు సెంట్రల్ పీస్ కమిటీ ప్రధానకార్యదర్శి శ్రీకిషన్ శర్మ ప్రకటించారు. ఈ సందర్భంగా ఆమెతో పాటు నూతనంగా నియమితులైన కమిటీ ప్రతినిధులను ఘనంగా సత్కరించి అభినందించారు. సెంట్రల్ జోన్ అధ్యక్షుడు శశికాంత్ అగర్వాల్, షేక్ నయీమ్, మహ్మద్ అసద్, గోపాల్‌దాస్, ఎస్.శరత్‌శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

జైస్వాల్ సేవా సమితికి స్థలాన్ని కేటాయించాలి



మంత్రి తలసానికి వినతిపత్రం అందజేస్తున్న జైస్వాల్ సేవా సమితి ప్రతినిధులు

సుల్తాన్‌బజార్: జైస్వాల్ సేవా కులస్థులకు స్థలాన్ని కేటాయించాలని బీజేపీ జాంబాగ్ కార్పొరేటర్ రాకేష్ జైస్వాల్ కోరారు. జైస్వాల్ సేవా సమితి ఆధ్వర్యంలో సోమవారం మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు రాకేష్ జైస్వాల్ ఆధ్వర్యంలో సమితి ప్రతినిధులు వినతిపత్రం సమర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. జైస్వాల్ సేవా సమితి సమాజంలో ఎన్నో సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుందన్నారు. పేదలకు పెళ్లిళ్లు, ఇతర శుభ కార్యాలకు చేసేందుకు స్థలాన్ని కేటాయించాలని మంత్రి తలసానిని కోరినట్లు తెలిపారు. ఇందుకు మంత్రి సానుకూలంగా స్పందించారన్నారు. ఈ కార్యక్రమంలో సేవా సమితి ప్రతినిధుజీలు నితిన్ జైస్వాల్, సంజయ్ జైస్వాల్, అశోక్ జైస్వాల్, శరద్ తదితరులు పాల్గొన్నారు.

ప్రత్యేక పూజలు

చార్మినార్: దూద్‌బౌలిలోని కాల భైరవ హనుమాన్ ఆలయంలో సోమవారం నిర్వహించిన నవగ్రహ పూజా కార్యక్రమంలో దక్షిణ మండలం డీసీపీ సాయి చైతన్య పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వాహకులు డీసీపీ సాయి చైతన్యను శాలువాతో ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో పంకజ్ నావేందర్, పవన్, నరేష్, కునాల్ రావు, సురేందర్ తదితరులు పాల్గొన్నారు.



పూజల్లో పాల్గొన్న డీసీపీ సాయి చైతన్యను సన్మానిస్తున్న నిర్వాహకులు

ముగిసిన థియేటర్ టెక్నికల్ వర్క్ షాప్



టెక్నికల్ వర్క్‌షాప్ ముగింపు సభ

నాంపల్లి: డిపార్ట్‌మెంట్ ఆఫ్ థియేటర్ ఆర్ట్స్ పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం హైదరాబాద్, రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ తెలంగాణ ప్రభుత్వం సంయుక్త నిర్వహణలో పది రోజుల జాతీయ స్థాయి థియేటర్ టెక్నికల్ వర్క్‌షాపు ముగిసింది. ఈ మేరకు సోమవారం తెలుగు వర్సిటీలో రిజిస్ట్రార్ ఆచార్య భట్టు రమేష్ అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్యఅతిథిగా బరోడా విశ్వవిద్యాలయం ప్రొఫెసర్ దర్శన్ సతీష్ చంద్ర పురోహిత్ హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో గౌరవ అతిథులుగా యూనివర్సిటీ ఆఫ్ హైదరాబాద్ ప్రొఫెసర్ డీఎస్ఎస్ మూర్తి, తెలుగు వర్సిటీ లలిత కళాపీఠం పీఠాధిపతి ప్రొఫెసర్ కోట్ల హనుమంతరావు, యూనివర్సిటీ ఆఫ్ పాండిచ్చేరి ప్రొఫెసర్ డాక్టర్ ఎల్.వి.భూషణ్, తెలుగు వర్సిటీ అసిస్టెంట్ ప్రొఫెసర్, వర్క్‌షాపు కో ఆర్డినేటర్ డాక్టర్ రాజు ఆంథోని, రంగస్థల కళల శాఖ అధ్యాపకురాలు డాక్టర్ బీహెచ్.పద్మప్రియ, మల్లాది గోపాలకృష్ణ, బీహెచ్.కల్యాణి పాల్గొన్నారు.

ప్రజలకు ఇబ్బంది కలిగేలా పనులు చేపట్టొద్దు



కాలనీ వాసులతో మాట్లాడుతున్న కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి

ఎల్‌బీనగర్: కాలనీలలో ప్రజలకు ఇబ్బంది కలిగేలా పనులు చేపట్టవద్దని బీఎన్‌రెడ్డినగర్ డివిజన్ కార్పొరేటర్ మొద్దు లచ్చిరెడ్డి అధికారులను కోరారు. డివిజన్ పరిధిలోని ఎస్‌కేడీ నగర్ చౌరస్తాలో నిర్మిస్తున్న ఫుట్ పాత్ కారణంగా ఇబ్బందులు కలుగుతున్నాయని పలువురు కార్పొరేటర్ దృష్టికి తీసుకెళ్లారు. దీంతో సోమవారం ఫుట్‌పాత్ పనులపై కార్పొరేటర్ జీహెచ్‌ఎంసీ ఈఈ రమేష్‌బాబు, డీఈ దామోదర్‌రావుతో కలిసి సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా లచ్చిరెడ్డి మాట్లాడుతూ.. ఫుట్‌పాత్ నిర్మించడం వలన రహదారి ఇరుగ్గా మారుతుందని, వాహదారులు తీవ్ర ఇబ్బందులు పడుతారని తెలిపారు. ప్రజలకు వాహదారులకు ఇబ్బందులు లేకుండా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు. నాయకులు ప్రభాకర్‌రెడ్డి, వెంకటరెడ్డి, యాదగిరిగౌడ్, కృష్ణ, గోపి, భాస్కర్‌రెడ్డి, శ్రీనివాస్, మెట్టుపల్లి సంతోష్, విష్ణువర్ధన్‌రెడ్డి, రవిశంకర్, కిషోర్, తదితరులు పాల్గొన్నారు.

కార్యవర్గ సమావేశంతో నాయకుల్లో నూతనోత్తేజం



సమావేశంలో పాల్గొన్న డీకే అరుణతో వీరేంద్రబాబు యాదవ్

సైదాబాద్: బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశంతో పార్టీ నాయకులు, కార్యకర్తల్లో నూతనోత్తేజం కలిగిందని బీజేపీ భాగ్యనగర్ జిల్లా అధికార ప్రతినిధి వీరేంద్రబాబు యాదవ్, ఓబీసీ మోర్చా రాష్ట్ర అధికార ప్రతినిధి లింగాల హరిగౌడ్ అన్నారు. సోమవారం ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని సరస్వతి కన్వెన్షన్ హాల్‌లో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సమావేశం నిర్వహించారు. సమావేశాన్ని పురస్కరించుకొని సైదాబాద్, ఐఎస్‌సదన్, చంపాపేట రహదారులు కాషాయ తోరణాలతో కళకళలాడాయి. సమావేశంలో నాయకులు పెద్దసంఖ్యలో పాల్గొన్నారు. సైదాబాద్ పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేసారు. సమావేశానికి బీజేపీ జాతీయ కార్యదర్శి సునీల్ భన్సల్, రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, ఎంపీ డాక్టర్ లక్ష్మణ్, డికె అరుణ, ఎమ్మెల్యే ఈటల రాజేందర్ తదితర జాతీయ, రాష్ట్ర నాయకులు పాల్గొన్నారు. సమావేశం అనంతరం వీరేంద్రబాబు, హరిగౌడ్‌లు మాట్లాడుతూ, పార్టీని ప్రజల్లోకి విస్తృతంగా తీసుకుపోవాలని నాయకులు మార్గనిర్దేశం చేసారన్నారు.

సందడి చేసిన విద్యార్థినులు



విద్యార్థినుల సాంస్కృతిక కార్యక్రమాలు

మన్సూరాబాద్: అనిబిసెంట్ ఉమెన్స్ కాలేజీ ఫేర్‌వెల్ డే వేడుకలు ఎల్‌బీనగర్‌లోని హిమగిరి ఫంక్షన్‌హాల్‌లో సోమవారం ఘనంగా నిర్వహించారు. కళాశాల వైస్ చైర్మన్ దయాకర్‌రెడ్డి, సెక్రటరీ డాక్టర్ శ్యాంసుందర్‌రెడ్డి, ప్రిన్సిపాల్ డాక్టర్ సురేఖరెడ్డిలు హాజరై వేడుకలను ప్రారంభించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఆత్మవిశ్వాసం, నైతిన విలువలు విద్యార్థులకు ముఖ్యమని సూచించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపక బృందం, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.



నాలా పూడికతీత పనుల పరిశీలన



పూడికతీత పనులను పరిశీలిస్తున్న కార్పొరేటర్ మహ్మద్ వసీయుద్దీన్

యాకుత్‌పురా: రానున్న వర్షాకాలంలో సమస్యలు తలెత్తకుండా నాలాలు, డ్రైనేజీ పూడికతీత పనులను చేపట్టి ముందస్తు చర్యలు తీసుకుంటున్నామని రెయిన్‌బజార్ కార్పొరేటర్ మహ్మద్ వసీయుద్దీన్ తెలిపారు. యాకుత్‌పురా రైల్వేస్టేషన్, యత్రఫ్‌నగర్, మదీనానగర్, ధోబీఘాట్ నాలా పూడికతీత పనులను సోమవారం ఆయన జీహెచ్‌ఎంసీ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. గతేడాది వర్షాలకు జలయమైన లోతట్టు ప్రాంతాల్లో నాలాలు, డ్రైనేజీ పూడికతీత పనులను చేపట్టి వర్షాపు నీటి సమస్యలు తలెత్తకుండా అవసరమైన చర్యలు తీసుకుంటున్నామన్నారు. ఇప్పటికే అధికారులతో పలు ప్రాంతాల్లో పర్యటించి బస్తీల్లో కొనసాగుతున్న అభివృద్ధి నిర్మాణ పనులను వెంటనే పూర్తి చేయాలని కోరామన్నారు. ఆయనతో పాటు మజ్లిస్ పార్టీ సీనియర్ నాయకులు మహ్మద్ వసీముద్దీన్, జీహెచ్‌ఎంసీ, ఇంజినీరింగ్, ప్రాజెక్ట్స్ విభాగం అధికారులు తదితరులు పాల్గొన్నారు.

రోడ్డుపై గుంతలు.. వాహనదారుల ఇబ్బందులు



హస్తినాపురం ఈస్ట్ కాలనీలో కూడలిలో రోడ్డుపై ఏర్పడిన గుంతలు

వనస్థలిపురం: వనస్థలిపురం డివిజన్ పరిధిలో హస్తినాపురం ఈస్ట్ కాలనీలో గౌతమి మోడల్ స్కూలు సమీపంలోని నాలుగు రోడ్ల కూడలిలో గుంతలు ఏర్పడి ఆ దారిన వెళుతున్న వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. హస్తినాపురం నుంచి వనస్థలిపురం వెళ్లడానికి ఇదే ప్రధాన రహదారి కావడంతో ఈ దారిన నిత్యం వేలాది వాహనాలు వెళుతుంటాయి, దీంతో గుంతలతో వాహనదారులు ప్రమాదాలకు గురవుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత ప్రజా ప్రతినిధులు, అధికారులు స్పందించి రోడ్డుకు మరమ్మతులు చేపట్టి గుంతలను పూడ్చాలని స్థానికులు కోరుతున్నారు.

జలమయమైన వ్యవసాయ మార్కెట్



జలమయమైన మార్కెట్ ప్రాంగణంలో వాహనదారుడి ఇబ్బందులు

చాదర్‌ఘాట్: రాత్రి కురిసిన వర్షానికి మలక్‌పేట వ్యవసాయ మార్కెట్ ప్రాంగణంలో నీరు నిలవడంతో రైతులు, వ్యాపారులు ఇబ్బందులు పడ్డారు. ఉల్లిగడ్డ, మిర్చి బస్తాలు తడిసిపోయాయి. నీరు తొలగించడంలో అధికారులు, మార్కెట్ కమిటీకి ఫిర్యాదులు చేస్తే తమ పరిధిలోకి రాదు అంటూ ముఖం చాటేశారు. జీహెచ్‌ఎంసీ అధికారులకు ఫోన్ చేస్తే అది మార్కెట్ వాళ్లే చూసుకోవాలని అధికారులు తెలిపారు. మార్కెట్‌లో ఫీజులు చెల్లిస్తుంటే అభివృద్ధికి సహాయపడాల్సిన వారు తమ పరిధిలోకి రాదంటూ సమస్యను జటిలం చేస్తున్నారు. సమస్య పరిష్కారం కాకపోతే ధర్నా నిర్వహిస్తామని వ్యాపారులు హెచ్చరించారు.